క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభాల ప్రతిష్ట



దాచేపల్లి : మండలంలోని శ్రీనివాసపురం గ్రామ సమీపంలోని అయ్యవారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, వినాయక స్వామి దేవాలయాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. పూజారులు వేదమంత్రాలతో ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవాలయాలు, విగ్రహాలను ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో ధ్వజస్తంబాలను ప్రతిష్టించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, మునగా నిమ్మయ్య, స్థానికులు బొజ్జా కృష్ణమూర్తి, జక్కా అశోక్, జక్కా ఏడుకొండలు, బొజ్జా నాగేశ్వరరావు, వేల్పుల చైతన్య, బొజ్జా శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాచర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశుభ్రతను పాటించి ప్రతి ఒక్కరూ ఎవరికీ ఇబ్బంది లేకుండా పర్యావరణాన్ని కాపాడాలని మాచర్ల అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ వి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఫారెస్టు కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో కలిసి అటవీ శాఖాధికారులు పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ బి నాగేశ్వరరావుతో పాటు అటవీ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం



మాచర్ల: పట్టణంలోని పాతమాచర్లలో వడ్డెర బజారులో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు ఉప్పుతోళ్ళ గోవిందరాజులు, కార్యదర్శి జూలకంటి వీరారెడ్డి తెలిపారు. ఆదివారం దేవాలయంలో వారు మాట్లాడుతూ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల యువజన విభాగ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయరఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, తురక కిషోర్ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా అన్నదానాన్ని జరిపి స్వామి వారిని ఊరేగించడం జరుగుతుందన్నారు.

పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన



పిడుగురాళ్ల: పర్యావరణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ వీరేశలింగం నాయుడు అన్నారు. పట్టణంలోని స్కాలర్ కాలేజీలో విద్యార్థులకు పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందనంను పొదుపు చేయాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని తెలియజేశారు. అదేవిధంగా ఎల్క్ట్రానిక్ వ్యర్థాల వాడకం తగ్గించుకోవడం వల్ల పర్యావరణాన్ని పరీక్షించుకోవచ్చునన్నారు. అదేవిధంగా సుస్థిరమైన ఆహార పద్ధతులను అలవర్చుకోండి, వ్యర్థాలను తగ్గించుకోవడం మంచిదని తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో కె. నరసింహారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు కరపత్రాలందించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా బలోపేతమై విద్యా, వైద్యంతో పాటు అన్నీ సంక్షేమ పథకాలు అందుకోవాలని, కుల, మత, పార్టీలకతీతంగా రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, దీనిని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెంది అన్ని సౌకర్యాలను పొందాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మూడవ రోజు ఆదివారం పట్టణంలోని 23వ వార్డులోని 35వ సచివాలయ పరిధిలో 131వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పీఆర్కే, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, వార్డు కౌన్సిలర్ మున్నా మురళి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం పేదరికంతో ఇబ్బంది పడకుండా ఉండాలన్న లక్ష్యంతోనే పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రతి పథకం ద్వారా ఆయా కుటుంబాలకు నాలుగేళ్ళుగా నేరుగా నగదు అందజేసి వారి జీవితాల్లో వెలుగునింపుతున్న ఘనత సీఎంకే దక్కుతుందని పీఆర్కే చెప్పారు. జగనన్న నువ్వే మా భవిష్యత్తు మా నమ్మకం, జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మేలు చేస్తూ ముందుకెళ్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా 267ల కుటుంబాలను 23వ వార్డులో సందర్శించి ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని కరపత్రాల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, తురక కిషోర్, అబ్దుల్ జలీల్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, గ్రీనరీ అండ్ బ్యూటీషియన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, కౌన్సిలర్లు పోలా శ్రీను, చంద్ర కుమార్, మాచర్ల చిన ఏసోబు, మందా సంతోష్, షేక్ కరిముల్లా, మస్తాన్, సుభాని, రామిశెట్టి వెంకటేశ్వర్లు, బి నరసింహారావు, జగన్నాథం శివయ్య, రామాంజనేయరెడ్డి, ఎం శ్రీనివాసరావు, బత్తిన వేణు, షేక్ దస్తగిరి, అనంతరావమ్మ, చందూ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఉప్పుతోళ్ళ సరోజని జే జేలు పలుకుతూ గడప గడపకు మన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ జిల్లా నాయకులు కామనబోయిన నాగరాజు, వీర్ల లింగయ్య, వీర్లబోయిన కృష్ణ, కామనబోయిన రమణయ్య, పచ్చిపాళ్ళ ఆంజనేయులు, చల్లా మోహన్, కామనబోయిన చంద్ర శ్రీను, అంకారావు, మున్నా శివ కృష్ణ, మంజుల సత్యనారాయణ, షేక్ మస్తాన్, తిక్కా కాశయ్య, వి లింగయ్య, ఎం గురవయ్య, వీర్ల బాలకృష్ణ, కామనబోయిన అక్కులు, మాజీ కౌన్సిలర్ వేముల కళ్యాణితో పాటు మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణబాబు, స్థానిక మెప్మా ప్రాజెక్టు మిషన్ మేనేజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

మద్దికర వెంకటేశ్వరరెడ్డి సేవలు మరువలేనివి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



స్థానిక నాయకులను కలిసి మాట్లాడుతున్న పీఆర్కే, పీవీఆర్‌లు

దుర్గి: వైఎస్సార్ సీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీకి అన్ని విధాలుగా తన సేవలను అందించిన మద్దికర వెంకటేశ్వరరెడ్డి (పెద్దాయన) సేవలు మరువలేనివి అని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కోలగుట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన వెంకటేశ్వరరెడ్డి దశదిన కర్మకార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వెంకటేశ్వరరెడ్డి విగ్రహాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే ఆవిష్కరించారు. తమలాంటి యువ నాయకులకు, కార్యకర్తలకు ఆయన స్ఫూర్తిని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులు సర్పంచ్ మద్దికర శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఏఎంసి చైర్మన్ వెలిదండి గోపాల్, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, జెడ్పీటీసి శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సాయి శంకర్, మాజీ జెడ్పీటీసి గోపిరెడ్డి, కారంపూడి ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు ఊరుబండి యోగయ్య, చల్లా శ్రీనివాసరావు, నాయకులు కటక చిన వెంకటయ్య, ఉన్నం పెద్దబ్బాయి, ఎకటీల బుచ్చిబాబు, నక్క ఆదినారాయణ, మమ్ము శ్రీనివాస్, నలబోలు మంగారావు, దేవిరెడ్డి నారాయణ, పీఎస్ఎస్ అధ్యక్షుడు కటకం రామారావు, ఊరుబండి యోగయ్య, సర్పంచులు తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటరామయ్య, నల్లబోతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడలు పోటీతత్వంతో ఆడాలి



గురజాల : క్రీడలను ప్రతి ఒక్క క్రీడాకారుడు పోటీతత్వంతో ఆడాలని వైద్యుడు చల్లగుండ్ల శ్రీరామమూర్తి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వీఎంఎస్ క్లబ్‌లో వాలీబాల్ పోటీలు శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుడు శ్రీరామమూర్తి మాట్లాడుతూ క్రీడలు మానసికొల్లాసంను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యుడు జి మధుకర్‌రెడ్డి, అక్కినపల్లి సైదులు, చిట్టిమాల ప్రసాద్, చంద్రారెడ్డి తదితరులున్నారు.

త్వరలో మినీ స్టేడియం ఏర్పాటు చేద్దాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోనే క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ఎస్సీ కాలనీలో 5 ఎకరాల్లో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలియజేశారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ క్రీడా మైదానంలో నిర్వహించిన వైనాట్ 175 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు కనుమరుగు అవుతున్న ఈ తరుణంలో ఎలాంటి టోర్నమెంట్‌ను ఆర్గనైజింగ్ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. 15 ఏళ్ల క్రితం నుంచి క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు సైతం ఈ క్రీడా పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలియజేశారు. గతంలో క్రీడాకారులకు ఎండ ఎంత కాసినా తెలిసేది కాదని, నేడు చాలా మంది క్రీడాకారులు టీవీల్లో క్రికెట్‌ను చూసి ఆనందించటమో, సెల్ ఫోన్‌ల్లో గేములు ఆడేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, గతంలో మధ్యాహ్న సమయంలో సూర్యుడిని సైతం లెక్క చేయకుండా క్రికెట్ ఆడేవారని ఆయన తెలియజేశారు. సెలవు రోజుల్లో సైతం స్నేహితులంతా కలిసి ఉండేందుకు ఈ టోర్నమెంట్‌లు ఎంతో దోహదపడతాయని ఆయన తెలియజేశారు. త్వరలోనే ఎస్సీ కాలనీలో పట్టాలు ఇవ్వాల్సిన వారికి ఇచ్చి అక్కడే పిడుగురాళ్ల పట్టణంలో క్రీడా ప్రాంగణం కోసం ఐదు ఎకరాలను కేటాయించి అక్కడ మినీ స్టేడియం ఏర్పాటు చేసుకుందామని ఆయన తెలియజేశారు. గెలుపు ఓటముల కన్నా ఆటలో మనం ఎంత ఉత్సాహంగా పాల్గొనమనేది ఎంతో ముఖ్యమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ పురుషోత్తం, మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎండీ గఫార్, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాలే మాణిక్యరావు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొక్కెర శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొడూరి ప్రసాదరావు, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, ఆవుల పుల్లారావు, మల్లవరపు దయాకర్, రత్నబాబు తదితరులు ఉన్నారు.

పొలంబాట పనులు ప్రారంభం



పొలంబాట పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పొలంబాట పనులను ఆదివారం ప్రారంభించారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో పొలంబాట పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులను జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండల పరిధిలో పొలంబాట పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ద్వారా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును కలిశామని, పొలంబాట పనులు చేసేందుకు కావాల్సిన యంత్రాలను సమకురుస్తామని మాట ఇచ్చారని చెప్పారు. ఇప్పటికే ముత్యాలంపాడులో 2కిలోమీటర్లకు పైగా పొలంబాట పనులు చేశామని, కేసానుపల్లిలో సుమారుగా 5 కిలోమీటర్ల మేర పొలంబాట పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వ్యవసాయ పనులకు రైతులు, రైతు కూలీలు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా పొలంబాట పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ పనుల ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కోట కొండలు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు చుండు రామారావు, నెల్లూరి రామారావు, ఉల్లేరు హనుమంతరావు, చెట్టిపాగు పాపయ్య, వినుకొండ చిన్నజాను, కొనరావు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



జెట్టిపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు అందుకున్న ఆంజనేయస్వామి



దేవాలయంలో పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



ప్రసన్నాంజనేయస్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు బోనాలతో వస్తున్న భక్తులు



కారెంపూడిలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మాచర్ల: హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని వివిధ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ఆదివారం ఉదయం నుంచే బారులు తీరి హనుమంతుని సేవలో తరించారు. పట్టణంలో వేంచేసియున్న శ్రీశైలం రోడ్డులో ఆంజనేయ స్వామిదేవాలయంలో అర్చకులు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, ట్రాన్స్‌పోర్టు అధినేత గాంధీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాత మాచర్లలో వేంచేసియున్న శ్రీ సువర్చల శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయంలో, శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానంలో సీతారామ గణేష్ సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం జరిపారు. నెహ్రూ నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో, యాదవుల బజారులో, బురుజు సెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిపారు.

పట్టణంలో అన్నదానాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ పీఆర్కే

పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లె రహదారిలో వేంచేసియున్న సీతారామాలయంలో హనుమంత్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ పీఆర్కే పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో వేల మందికి జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, తురక కిషోర్, శ్రీనివాసశర్మ, జూలకంటి వీరారెడ్డి, బీసి సంఘ నాయకులు బండారు శ్రీను, మంజుల మల్లికార్జునరావు, కృష్ణ, టి శ్రీకాంత్, చల్లా మోహన్, కె రమేష్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, పున్నయ్య, ఆయా వార్డు కౌన్సిలర్లు నరసింహారావు, మాజీ కౌన్సిలర్ వేముల కళ్యాణి, మంజుల కృష్ణ, కొట్టు వెంకటేశ్వర్లుతో పాటు తదితరులున్నారు.

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో వేంచేసిన ఆంజనేయస్వామి దేవస్థానంలో, ఆర్యవైశ్య పరమేశ్వర స్వర్గపురి ఆవరణలోని శ్రీ అభయాంజనేయస్వామి మందిరంలో, ఎల్ఎల్ఆర్ స్కూల్ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో, జెట్టిపాలెం గ్రామంలోని ఏపి మోడల్ స్కూల్ సమీపంలో వేంచేసిన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో, రెంటాల గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో, పాలువాయిగేటు గ్రామంలోని మంచికల్లు అడ్డ రోడ్డు వద్ద నున్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు పుణ్యదంపతులు అర్చకుల నేతృత్వంలో సమష్టిగా ప్రత్యేక పూజలు చేశారు. భజనబృందం హనుమాన్ గీతాలను ఆలపించి భక్తులను తన్మయపరిచారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాచేపల్లి : మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మాదినపాడు రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రాయల్ శ్రీధర్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, కొలా జంపాల రెడ్డి, కౌన్సిలర్లు నాగుబండి గురువులు తదితరులు పూజలు చేసి భక్తులు స్వామివారి ప్రసాదంను అందించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ద్విచక్రవాహనాల ర్యాలీ ప్రదర్శించారు.

గురజాల : మండల పరిధిలోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. రైల్వే గేటు సమీపంలో శ్రీ పంచముఖ అభయాంజనేయ స్వామి, పల్లెగుంత రోడ్డులో ఆంజనేయ స్వామి, కోత మిషన్ సెంటర్‌లో, గాంధీబొమ్మ సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో వేంచేసియున్న ఆంజనేయ స్వామి వారి దేవాలయాలు హనుమాన్ జయంతి నిర్వహించారు. అదే విదంగా మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం అన్నప్రసాదాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించారు.

వెల్దుర్తి: శిరిగిరిపాడులో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు యండపల్లి సుబ్బారావు, శ్రీహరిలు ఆదివారం తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం 5గం''లకు రథోత్సవ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాచవరం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీహనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, సామూహిక ఆకుపూజా, అభిషేకాలు నిర్వహించారు. పిల్లుట్ల గ్రామ శివారులో అభయ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. పిన్నెల్లి గ్రామ శివారు రామచంద్రాపురంలో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మోర్జంపాడు, మాచవరం గ్రామాల్లోని భారీ హనుమాన్ విగ్రహాల వద్ద భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయపురిసౌత్: హనుమాన్ జయంతి వేడుకలను విజయపురిసౌత్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ ధర్మకర్త, అర్చకులు లష్కర్‌నాయక్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 700 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే విజయపురిసౌత్‌లోని టి-జంక్షన్ వద్ద పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు రంగాస్వామి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కారెంపూడి : హనుమత్ జయంతి ఉత్సవాలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం వైభవంగా జరిగాయి. ఒప్పిచర్ల గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు విశ్వనాథం అయ్యగారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వేలాదిగా గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే కారెంపూడి మిట్టమీద ఆంజనేయ స్వామి దేవాలయంలో వివిధ రకాల అభిషేక ఆకుపూజలను అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు నిర్వహించారు. మహిళలు 108 సార్లు హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు.

పిడుగురాళ్ల: హనుమాన్ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. స్వామివారిని దర్శించుకునే భక్తులు బారులు తీరడంతో హనుమాన్ ఆలయాల వద్ద భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం సువర్చల సమేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి కల్యాణం నిర్వహించారు.

అ'పూర్వ' కలయిక



ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు

తుమ్మకోట(రెంటచింతల): ఎక్కడెక్కడో పుట్టి అంతా ఒక్క చోటికి చేరి విద్యాభ్యాసంచేసిన విద్యార్థులు తిరిగి 20 ఏళ్లకు మళ్లీ అంతా కలిశారు. గుర్తుపట్టని ఆకారాలతో ఒకరిని ఒకరు పరిచయం చేసుకుంటూ ఆనాటి తీపిగుర్తులను నెమరవేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 బ్యాచ్ 10వతరగతి చదివినవారు ఆదివారం పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పోట్ల రామకృష్ణ అధ్యక్షతన సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళన వేడుకలను నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటు పాఠశాల ఆవరణమంతా కలియతిరిగారు. క్రీడామైదానంలో వివిధ రకాల ఆటలను ఆడారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారు కుర్చున్న తరగతి గదుల్లో మరోసారి కుర్చుని ఆనాటి ఉపాధ్యాయులు బోధిస్తున్నప్పుడు ఎలా శ్రద్ధగా విన్నారో మననం చేసుకున్నారు. గుదే వెంకటేశ్వర్లు, చదలవాడ కృష్ణవేణి, నవులూరి శ్రీనివాసరావు, శివలక్ష్మి, పోట్ల సంధ్యారాణి, దిర్శినాల వెంకటేశ్వర్లు తదితర పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులంతా తమ నుతాము వేదికపై పరిచయం చేసుకుని తమకు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జెడ్పీ పాఠశాలలో చదువుకుని పూర్వ విద్యార్థుల వేడుకలను నిర్వహించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆనాటి ఉపాధ్యాయులను, ప్రస్తుతం విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను దుశ్శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కాసు శౌరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పోట్ల రామకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ టీడీపీనే



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కారెంపూడి: మండల టీడీపీ నాయకులు సింగరుట్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను, పోరంబోకు భూములను ఫారెస్టు భూములను కబ్జాలు చేసి అమ్ముకున్నారని, చివరకు ఒప్పిచర్లలో 300 మరుగుదొడ్ల నిధులు కూడా స్వాహా చేసిన చరిత్ర వారిదని అలాంటి వారు పవిత్ర దేవత అంకాలమ్మ గుడిలో ప్రమాణాలు చేద్దామని సవాల్ చేయడం వింతగా ఉందన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తి గొడవలు జరగాలనేది వారి పన్నాగమన్నారు. మేము ప్రమాణాలకు సిద్ధమైతే శాంతిభద్రతల సమస్య వస్తుందని పోలీసులు హెచ్చరించడంతో ఆగామన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నాయకులు చేసిన అవినీతి అక్రమాలను వైఎస్సార్ సీపీ నాయకులు బహిర్గతం చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించే విషయంలో రైతుల నుంచి డబ్బులు దండుకున్న విషయం వాస్తవం కాదా, కాపు కార్పొరేషన్ రుణాలిప్పించేందుకు ఒక్కొక్కరి వద్ద రూ.15 వేలు వసూలు చేశారని, వారందించిన అరకొర సంక్షేమ పథకాలలో కూడా డబ్బు తీసుకోకుండా ఏ సంక్షేమ పథకాన్ని కూడా ప్రజలకు అందించలేదన్నారు. జన్మభూమి కమిటీలను అడ్డుపెట్టుకుని అవినీతి అక్రమాలకు పాల్పడిన మీకు మీరు వైఎస్సార్ సీపీని విమర్శించేస్థాయి ఉందా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రతి గడపకు మేలు చేసి ధైర్యంగా చెప్పుకునే అవకాశం తమకు తమ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, ఎంపీటీసీలు షేక్ ఆరీఫ్, అంతరగడ్డ ఏసోబు, వేముల పద్మలింగయ్య, కొమ్ము చంద్రశేఖర్, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, ఆశం విజయభాస్కరరెడ్డి, చింతల శ్రీనివాసరావు, పలిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గురజాల డీఎస్పీ విస్తృత పర్యటన

దుర్గి: ఇటీవల గురజాల సబ్ డివిజన్‌కు నూతనంగా నియమితులైన డీఎస్పీ పల్లపురాజు ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ఎస్ఐ కె సతీష్‌ను వెంటబెట్టుకుని మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. శాంతిభద్రతల చర్యలో భాగంగా పలు గ్రామాలరూట్ మ్యాప్‌ను తెలుసుకున్నారు.